


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ డ్వీపే డొయిచ్ ఖండే

# చివరి విడత: మలి సందడి (32)

## మరో దేవుడు పిలిచాడు

విలియమ్సు అడిగిన ఆ ప్రశ్న నాకు ఇబ్బందిగా అనిపించింది.

నన్నెవరైనా కులం గురించి అడిగితే ఎంత ఇబ్బంది పడతానో, మతం గురించి అడిగినా అంతే ఇబ్బంది పడతాను.

ఎందుకంటే నేనెప్పుడూ నన్ను ఓ మతంతో కలిపి గుర్తించలేదు.

“ఈ ప్రశ్న ఎందుకడిగారు?” అనడిగాను.

“ఏం లేదు? హిందువులు దేవుణ్ణి ప్రార్థించడానికి గుడికెడతారుగా. మరి మీకు తరచుగా వెళ్లడానికి గుడి లేదిక్కడ” అన్నాడతడు.

“ఐతే?” అన్నాను ఆశ్చర్యంగా.

“గుడికెళ్లే అవకాశం బొత్తిగా లేనప్పుడు ఏదోలా అనిపిస్తుందిగా....” అన్నాడతడు.

“ఎందుకనిపిస్తుంది? ఇండియాలో ఉన్నప్పుడే, మేం నెలల తరబడి గుడికెళ్లని సందర్భాలున్నాయి” అన్నాను.

అతడు అదోలా చూశాడు, “నేను క్రిస్టియన్ని. ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న నియో కేథలిక్ చర్చికి ప్రతి ఆదివారం వెడతాను. ఏ వారమైనా అనుకోకుండా మిస్సయితే మనసేదోలాగైపోతుంది. మరి మీకేమనిపించదా?” అన్నాడు.

“ప్రతి వారం చర్చికెళ్లాలని మీకు నియమం. అందుకని అలా అనిపించొచ్చు. మాకలాంటి నియమంలేదు. అందుకని మాకేమనిపించదు”

“నియమమెందుకు లేదు? మీకు దేవుడిపై నమ్మకం లేదా?” అన్నాడతడు.

“నమ్మకం లేకపోతే గుడికే వెళ్లనుగా” అన్నాను.

అతడి కళ్లు మెరిసాయి. కానీ నా సమాధానం అతడికి సంతృప్తికరంగా ఉన్నట్లు లేదు, “ఇలా అడుగుతున్నానని ఏమనుకోవద్దు. మీకు దేవుడిపై నమ్మకముందిగా” అన్నాడు.

ఏదో అడిగాడు కానీ ముఖభావాలు చూస్తే జవాబు తెలుసన్నట్లే అనిపించింది.

కారణం ఊహించగలను. చాలామంది పాశ్చాత్యులు శ్రీమతి నుదుటనున్న కుంకుమబొట్టుని– అలంకరణగా భావించరు. అదో మతచిహ్నం అనుకుంటారు.

దేవుడి విషయమై అతడంత సూటిగా అడగ్గానే కొంచెం తడబడ్డాను. ఎందుకంటే ఆ విషయమై నా ఆలోచనల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. ఎదుటివ్యక్తిని బట్టి సమయానుకూలంగా అప్పటికి తోచిన జవాబిచ్చినా, నేను నాస్తికుణ్ణని మాత్రం

ఎప్పుడూ అనలేదు, అనుకోలేదు. "దేవుణ్ణి నమ్మకపోతే అది మనిషి అహంకారమని నాకనిపిస్తుంది" అని మనసులో మాటే చెప్పాను.

"చాలా బాగా చెప్పారు. దేవుడు లేందే ఈ సృష్టి లేదు. అవసరమైనవన్నీ సమకూర్చేకనే, దేవుడు మనిషిని సృష్టించాడు. అందుకు మనం దేవుడికి సర్వదా కృతజ్ఞులమై ఉండాలి. కనీసం వారానికొకసారైనా ఆయన్ని ప్రార్థించాలి. అందుకే నేను ప్రతివారం చర్చికి వెడతాను. అభ్యంతరం లేకపోతే మీరూ రావచ్చు. నేను తీసుకెడతాను" అన్నాడతడు.

ఇండియాలో ఉండగాకానీ, ఇక్కడికొచ్చేక గానీ – నేను చర్చికెళ్లినా, మసీదుకెళ్లినా టూరిస్టుగా మాత్రమే!

నాకున్న మంచిమిత్రుల్లో క్రిస్టియన్లూ, ముస్లిములూ ఉన్నారు. ఐనా నేనెప్పుడూ ప్రార్థనకోసం చర్చి, మసీదులకి వెళ్లలేదు. నా మిత్రులు కూడా నన్నెప్పుడూ ఆహ్వానించలేదు. ఆహ్వానించలేదన్న విషయం నాకూ, వాళ్లకీ కూడా ఎప్పుడూ స్ఫురించలేదు.

ఐతే సినిమాల్లో చూడ్డంవల్ల – అక్కడ లోపల వాతావరణం ఎలా ఉంటుందో తెలుసు.

ఇప్పుడు విలియమ్సు ఆహ్వానించగానే, ప్రత్యక్షంగా ఆ వాతావరణపు టనుభూతిని పొందొచ్చుననిపించి, వెంటనే సరేనన్నాను.

మారాలోచన లేకుండా నేనలా అన్నందుకు అతడు ఆశ్చర్యపడి, "ఐతే ఈ ఆదివారం వెడదామా?" అన్నాడు.

"సరే, టైం ఫిక్స్ చెయ్యండి" అన్నాను వెంటనే.

ఆదివారం సాయంత్రం నాలుగింటికి టైం ఫిక్స్ చేశాడు విలియమ్సు.

అరోజు అతణ్ణి మా ఇంటికి టీకి రమ్మన్నాను. టీ తాగేక అంతా కలిసి బయల్దేరొచ్చన్నాను.

జర్మన్సు అపరిచితులతో అంత సులభంగా చనువు పెంచుకోరు. అందుకే అతడందుకు ఒప్పుకోకపోతే నేను బలవంతపెట్టలేదు.

ప్రోగ్రాం ఫిక్సయింది. ఆదివారం సాయంత్రం పావుతక్కువ నాలుగుకల్లా మేం మా ఇంటిముందున్న పార్కు దగ్గరికెళ్లాలి. అప్పటికతడు అక్కడే మాకోసం ఎదురుచూస్తుంటాడు. అక్కణ్ణించి చర్చికి ఐదారు నిముషాలు నడకట.

సకుటుంబంగా రావాలని మరీ మరీ నొక్కించి సెలవు తీసుకున్నాడతడు.

"అలా ఒప్పేసుకున్నారేంటి?" అంది శ్రీమతి అతడలా వెళ్లగానే.

అడిగిన పద్ధతిని బట్టి తనకు నచ్చలేదని తెలుస్తోంది.

"ఇక్కడికొచ్చి ఎన్నో కొత్త విశేషాలు చూశాం. ఓసారి వాళ్ల గుడిలోపల ప్రార్థన ఎలా ఉంటుందో కూడా చూద్దాం" అన్నాను.

"ఏ స్నేహితులతోనో వెడితే అది వేరు. ఇతడెవరో మనకి తెలియదు"

"తెలియకపోవడమేంటి? అతడి పేరు విలియమ్సు" అన్నాను.

"అంతే తెలుసు మనకి. తనకి మన పేర్లు తెలుసా అన్నది కూడా అనుమానమే!"

"చాలా కాలంగా అతడి మొహం తెలుసు. కనీసం చిరునవ్వుతో పలకరించుకుంటున్నాం. ఆ చనువుతో మనని చర్చికి ఆహ్వానించాడు"

"మీకలా అనిపించిందా, నాకైతే తన చనువు మనని చర్చికి తీసుకెళ్లడం కోసం మాత్రమేనని. లేకుంటే, మీరు టీకి పిలిస్తే వచ్చేవాడుగా"

ఏదో అనబోయి ఆగిపోయాను.

ఈ విషయమై శ్రీమతి నాకంటే కాస్త లోతుగా ఆలోచించినట్లు తోచింది.

కనబడినప్పుడు మమ్మల్ని 'నమస్తే' అని పలకరించే అతగాడు మమ్మల్నెప్పుడూ తనింటికి ఆహ్వానించలేదు. ఈరోజు నేనాహ్వానించినా అది పక్కన పెట్టాడు.

నన్ను చర్చికి తీసుకెళ్లడంకోసమే నాతో పరిచయం పెంచుకున్నాడా?

కానీ నన్ను చర్చికి తీసుకెళ్లడంవల్ల అతడికి కలిగే ప్రయోజనమేమిటి?

అనుమానం సీసాలో భూతంలాంటిది. దాన్ని బయటకు తీస్తే పెనుభూతమై మహాశక్తిని ప్రదర్శిస్తుంది. అందువల్ల జరిగేది మేలా, కీడా అన్నది మన అదృష్టంమీద ఆధారపడి ఉంటుంది.

"మన అనుమానాన్ని సీసాలోనే ఉండనిద్దాం. ఇప్పట్నించీ బిరడా తియ్యొద్దు" అన్నాను శ్రీమతితో.

"నాకే మనుమానం లేదు కానీ, చర్చికి మీరొక్కరే వెళ్లండి. నేనూ, పిల్లలూ ఇంట్లోనే ఉంటాం" అంది శ్రీమతి.

"అంతా కలిసి రావాలని విలియమ్సు నొక్కించాడు. నేను కూడా ఒప్పుకున్నాను" అన్నాను.

"అసలు నన్నడక్కుండా ఎందుకొప్పుకున్నారు? ఏదో కారణం చెప్పుకోండి. మేం రాం" అంది శ్రీమతి ఖచ్చితంగా.

"నిన్నడక్కపోవడం తప్పే. కానీ మీరు రాకుండా నేనూ వెళ్లను. మాట తప్పినప్పుడు సగమైతే ఏంటి, పూర్తిగా ఐతే ఏంటి?"

మా మాటలు పాప వింటున్నట్లుంది, "మనం చర్చికి వెడదాం అమ్మా!" అంది తనూ సంభాషణలో కలగజేసుకుంటూ.

శ్రీమతికి చిరాకేసింది, "నువ్వొకత్తివి. అన్నింటికీ నాన్నకే వత్తాసు. అసలు నీకు చర్చంటే ఎంటో తెలుసా?" అంది.

"తెలుసు. ఇక్కడివాళ్ల గుడి" అంది పాప.

తెల్లబోయాను. పాపకీ విషయం ఎప్పుడు తెలిసింది? ఎలా తెలిసింది?

పిల్లలు మనకు తెలియకుండానే మననుంచే చాలా విషయాలు తెలుసుకుంటారు. అందుకే ఇంట్లో ఏం చేసినా, ఏం మాట్లాడినా – వాళ్లని కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

శ్రీమతికి కూడా ఏమనాలో తెలియలేదు.

చర్చి అంటే జర్మనీలో ఉండే గుడి అన్నంతవరకే పాపకి తెలిసింది. వాళ్ల గుడి వేరు, మన గుడి వేరు అని దానికింకా తెలియదు. గుడి కాబట్టి వెడదామంటోంది. దానికి భక్తి గురించి కూడా ఎక్కువ తెలియదు. గుడికెళ్లడం అదో అనుభవం. అంతే!

ఇప్పుడేం మాట్లాడినా, మతం ప్రసక్తి వస్తుంది. అది శ్రీమతికీ ఇష్టం లేదు.

ఆట్టే మాటలు లేకుండా ఇల్లు చేరాం.

ఇంట్లో పాప నడిగింది శ్రీమతి, "నీకు గుడికెళ్లాలనుందా?"

"ఔనమ్మా" అంది పాప.

"గుడికెళ్లి ఏం చేస్తావ్?"

"నాన్నగారు ఎత్తుకుంటే గంట కొడతాను. దేవుడికి దణ్ణం పెడతాను. శఠగోపం పెట్టించుకుంటాను. అప్పుడు_ _ _.." అని సంకోచంతో ఆగింది.

"ఊఁ అగిపోయావేం, చెప్పు" అంది శ్రీమతి.

"ప్రసాదం తింటాను" అంది పాప.

పాప తెలివైనది. గుడిలో దానికి అత్యంత ఆకర్షణీయమైనది ప్రసాదం. మళ్లీ ఆ మాట చెప్పాలంటే మొహమాటం. అందుకని స్వానుభవం లోని కొన్ని విశేషాలు ముందు చెప్పింది. ప్రసాదం విషయం చెప్పొచ్చా, కూడదా అని సంకోచించింది.

ఆ మాటే శ్రీమతి అంటే, నేను నవ్వి, "పాప చిన్నపిల్ల. మరి చాలామంది పెద్దవాళ్లు గుడికెళ్లడానిక్కారణమడిగితే నిజం చెప్పడానికి సంకోచిస్తారా, లేదా – అది చెప్పు" అన్నాను.

పరీక్షలో ప్యాసవ్వాలని కొందరు. సంతానం కావాలని కొందరు. వ్యాపారంలో లాభంకోసం కొందరు. ఎన్నికల్లో నెగ్గాలని కొందరు. ఇంకా పొరుగువాడు తమకంటే తక్కువగా ఉండాలనుకునేవారూ ఉంటారు.

ఇలా సవాలక్ష కారణాలుంతాయి. కానీ కేవలం భక్తితో గుడికెళ్లేవారెందరు?

శ్రీమతికి అర్థమై సన్నగా నవ్వి ఊరుకుంది.

అంతలో బాబు అందుకుని, "గుయ్యో పెసాదం బాంతుంది. నాకిట్టం" అన్నాడు.

అంటే, వాడూ మా సంభాషణ వింటున్నాడు.

పిల్లలిద్దరూ కూడా సరదా పడ్డంతో – మా చర్చి సందర్శన వివాదానికి తెర పడింది.

అనుకున్న ఆదివారంనాడు అనుకున్న విధంగా బయల్దేరి అనుకున్నట్లే విలియమ్సుతో కలిసి నాలుగయ్యేసరికి చర్చికి వెళ్లాం.

చర్చి మా ఇంటికి దగ్గరే.

చర్చి ప్రాంగణం విశాలంగా ఉంది.

లోపలికి వెళ్లబోతుంటే, "అమ్మా! బూట్లు విప్పలేదు" అంది పాప.

పాపకీ మాకూ అదే తేడా.

అది గుడిలోపల అడుగెడుతున్నామనుకుంటోంది. మేము ఓ కొత్త ప్రదేశానికి సందర్శకులమనుకుంటున్నాం.

అందుకే మాకు బూట్ల విషయం కానీ, చర్చి లోపలకు బూట్లతోనే వెళ్లొచ్చునని కానీ ప్రత్యేకంగా స్ఫురించలేదు.

"ఇది చలి దేశం. బూట్లిప్పితే, కాళ్లకు చలేస్తుంది. అందుకని దేవుడు ఇక్కడి పద్ధతులు కొంచెం మార్చాడు" అన్నాను.

అంతా లోపలకు వెళ్లాం.

లోపల బోలెడు కుర్చీలు. పరిశుభ్ర వాతావరణం. ఎందరో భక్తులు. మేం తప్ప అంతా తెల్లవాళ్లు.

విశాలమైన వేదిక. వేదికపై కుర్చీలు. కొందరు ప్రీస్టులు.

అచ్చం సినిమాల్లో చూపించే చర్చిల్లాగానే ఉంది.

మేం లోపలకు రాగానే చాలామంది మమ్మల్ని కుతూహలంగా చూశారు. కొందరు చిరునవ్వుతో పలకరించారు.

మెడనుంచి, పాదాలదాకా వేలాడే పొడవాటి తెల్లటి గౌను ధరించిన ఓ ప్రీస్టు హడావుడిగా మా దగ్గరకొచ్చాడు. విలియమ్సు మమ్మల్ని ఆయనకి పరిచయం చేశాడు. ఆయన తనని ఫాదరుగా పరిచయం చేసుకుని, "మీరిలా ఇక్కడికి రావడం మాకెంతో సంతోషంగా ఉంది. మా చర్చికి స్వాగతం" అన్నాడు.

ఆయన ఇంగ్లీషులో మాట్లాడేడు. ఆయన భాష శ్రీమతికి కూడా అర్థమయ్యేటంత సరళంగా ఉంది.

ఆయన మా అందరితో కరచాలనం చేసి తనూ వేదికమీదకి వెళ్లాడు.

మేం కుర్చీల్లో పక్కపక్కనే కూర్చున్నాం.

వేదికమీద ఏం జరుగుతోందో నాకూ పూర్తిగా అర్థం కాలేదు. ఎందుకంటే ప్రీస్టులు ఒకొక్కరుగా మాట్లాడుతున్నారు. అది జర్మనో, మరేదైనా భాషో కానీ నాకు ఒక్క ముక్క అర్థం కాలేదు. మాట స్పష్టంగా వినబడకపోవడం కూడా బహుశా ఓ కారణం కావచ్చు.

మాట్లాడ్డం ముగియగానే 'ఆమెన్' అంటున్నాడు ప్రీస్టు. అప్పుడు మిగతా ప్రీస్టులు 'ఆమెన్' అంటున్నారు.

ప్రతి ప్రీస్టు చేతిలోనూ నేతి జారీలాంటి పాత్ర ఒకటి ఉంది. దాంట్లోంచి కాసిని నీళ్లు అరచేతిలో పోసుకుని తాగి, 'ఆమెన్' అంటున్నారు.

తర్వాత వాళ్లు గౌను జేబుల్లోంచి కాబోలు పిప్పరమెంటులాంటి తెల్లటి బిళ్ల ఒకటి తీసి నోట్లో వేసుకుని, 'ఆమెన్' అంటున్నారు.

బహుశా అది ప్రార్థన కావచ్చు. ఆ తతంగం చాలాసేపే జరిగింది. నాకైతే బోరనిపించింది. మావాళ్లని చూస్తే వాళ్లు కుతూహలంగానే చూస్తున్నారు.

కాసేపటికి వేదికమీదున్న వాళ్లలో ఓ పెద్దాయన అక్కడున్న వారందర్నీ ఉద్దేశించి ప్రసంగం చేశాడు.

బహుశా ప్రబోధం కావచ్చు. సభికులు శ్రద్ధగా వింటూ మధ్మ మధ్య చప్పట్లు కొడుతున్నారు.

ఐదు కాకుండానే సభ ముగిసింది.

మేము లేచి కదులుతుండగా చప్పున మావద్దకు ఇద్దరు ప్రీస్టులు వచ్చారు. వారిలో మొదట నన్ను పలకరించిన ప్రీస్టు కూడా ఉన్నాడు.

"ఎలా ఉంది ఈ అనుభవం?" అనడిగాడు మొదటి ప్రీస్టు.

"కొత్తగా ఉంది" అన్నాను.

"నచ్చిందా?"

"ఊఁ బాగుంది" అని కదలబోతుండగా, "మీతో కొంచెం మాట్లాడాలి" అన్నాడు రెండో ప్రీస్టు.

"ష్యూర్" అన్నాను.

"ఇక్కడ కాదు. మీ ఇంటికి రావచ్చా?" అన్నాడాయన.

అలా అంటాడని ఊహించలేదేమో తడబడ్డాను.

విలియమ్సుని టీకి పిలిస్తే రానన్నాడు.

ఈయన పిలవకుండానే వస్తానంటున్నాడు.

"నిజంగానే మీరు మా ఇంటికొస్తానంటున్నారా?" అడిగాను ఆశ్చర్యంగా.

"ఔను. మీకు అభ్యంతరం లేకపోతేనే....."

"అయ్యో! మీ అంతటివారు మా ఇంటికొస్తానంటే అంతకంటేనా? మీకు మా స్వాగతం" అన్నాను చటుక్కున.

ఆయన మొహం వెలిగింది. థాంక్సు చెప్పి మాకెప్పుడు వీలని అడిగాడు.

"నాకు శనాదివారాలు సెలవు" అన్నాను.

ఆయన ఓ క్షణం ఆలోచించి పై శనివారం మధ్యాహ్నానికి టైం ఫిక్సు చేశాడు. ఆయనతో పాటు పక్కనున్న ప్రీస్టు కూడా వస్తాట్ట.

సరేనని అక్కణ్ణించి బయల్దేరాం.

ఇక దారి తెలిసింది కాబట్టి విలియమ్సునుంచి కూడా వీడ్కోలు తీసుకున్నాం.

తన ఆహ్వానాన్ని మన్నించి వచ్చినందుకు విలియమ్సు మాకు థాంక్సు చెప్పి వెళ్ళాడు.

దారిలో పాప అంది, "ఈ గుడిలో మనం కొట్టడానికి గంట లేదు. చూడ్డానికి దేవుడు లేడు" అని.

ఉలిక్కిపడ్డాను. ఎంత మాటంది పాప!

చర్చిలో దేవుడు లేడా?

మతచాందస ఉగ్రవాదులు తన మాటలు విన్నారంటే – మొత్తం మా కుటుంబాన్నే కాదు, అక్కడున్న నా మిత్రబృందం అందర్నీ పరశురాముడిలా వెదికి వెదికి మరీ చంపెయ్యరూ!

కానీ పాప అవగాహనే వేరు. దానికి దేవుడంటే విగ్రహం.

చర్చిలో ఏసుక్రీస్తు శిలువ ఉండొచ్చు. మేరీమాత పటం ఉండొచ్చు.

దణ్ణం పెట్టుకుందుకు ప్రత్యేకంగా విగ్రహం లేదు కాబట్టి పాపకక్కడ దేవుడు లేడు.

క్రైస్తవులు విగ్రహారాధనని నిరసిస్తారు. కానీ వారికీ ప్రార్థనలకి ఓ గుడి కావాలి.

దైవప్రార్థనకి ప్రత్యేకంగా స్థలం కావాలనుకునేవారు, ప్రత్యేకంగా విగ్రహం కావాలనుకోవడాన్ని నిరసించడం ఏమిటో!

దైవభక్తి విషయంలో తర్కానికి అంతో ఇంతో ప్రాధాన్యమిచ్చేది హిందూత్వమేనేమో అనిపించింది.

ఐతే అప్పుడా విషయమై లోతుగా ఆలోచించాలనుకోలేదు.

పాపని సముదాయించడంకోసం, "చర్చిలో గంట లేకపోవడమేమిటి? పొద్దున్నా, మధ్యాహ్నం, సాయంత్రం గంట మోగిస్తారు. అప్పుడప్పుడు మనింటికీ వినబడుతుంటుంది" అన్నాను.

"కానీ మనం కొట్టడానికి లేదుగా" అంది పాప.

"నీకు చర్చి నచ్చలేదా?" అన్నాను ఆ విషయం తప్పిస్తూ.

ఉన్నట్టుండి బాబు అన్నాడు, "పెసాదం మనకి పెత్తకుండా, అంకుల్సే తినేశారు" అన్నాడు.

"అవున్రా బాబీ! మన గుళ్లో ప్రసాదం మనకి పెడతారు. ఇక్కడేమో పూజార్లే తినేస్తారు" అంది పాప తమ్ముడితో.

పిల్లలకి సంబంధించి – చర్చికీ, గుడికీ ఉన్న తేడా ఎలా అర్థమయిందో గ్రహించిన శ్రీమతి కిసుక్కున నవ్వింది.

ఆ నవ్వు ఇల్లు చేరేదాకా మాత్రమే ఉంది. ఇల్లు చేరేక ఆమె మొహం గంభీరంగా మారింది. ఎప్పుడడగాలా అని ఎదురుచూస్తున్న అవకాశం అప్పుడే వచ్చినట్లుగా, "మీరా ప్రీస్టుల్ని ఇంటికి రమ్మన్నారెందుకు?" అంది.

"అదేమిటి? వస్తానన్నవాళ్లని రావద్దని ఎలాగంటాం?" అన్నాను తేలికగా.

"మీరు విలియమ్సుని టీకి రమ్మన్నారు. రాననడానికి అతగాడు సంకోచించలేదు. వీళ్లేమో తామే వస్తామన్నారు. వద్దనడానికి మీరెందుకు సంకోచించాలి?" అంది శ్రీమతి.

"మనం విలియమ్సు ఇంటికి వస్తామన్నామనుకో. అప్పుడతడు మాత్రం వద్దనేవాడా?" అన్నాను.

"అనేవాడనే నాకనిపిస్తుంది"

"ఎందుకని?"

"ఎందుకని అడుగుతున్నారు. మీకింకా అర్థం కాలేదా? విలియమ్సుకి మనతో స్నేహం పెంచుకోవడం ఇష్టం లేదు. మనని చర్చికి తీసుకెళ్లి అక్కడి ప్రీస్టులకి పరిచయం చెయ్యడం అతడి ఆంతర్యం. అది నెరవేరింది" అంది శ్రీమతి.

"పోనీ అదే అతడి ఉద్దేశ్యమనుకో. అందువల్ల అతడికేం ప్రయోజనం?" అన్నాను.

"అతడికేం ప్రయోజనమో నాకు తెలియదు. కానీ అతగాడు ఆ ప్రీస్టుల మనిషి. వాళ్లకోసం ఆ పని చేసిపెట్టాడు"

ఉలిక్కిపడ్డాను. ఈ వ్యవహారానికి ఇదేదో కొత్తకోణం.

"పోనీ, ఆ ప్రీస్టులకి మాత్రం మనవల్ల ఏం ప్రయోజనం?" అన్నాను. అన్నాను కానీ అర్థమౌతోంది.

విలియమ్సు మమ్మల్ని తొలిసారి పలకరించింది మొదలు – ఇంతవరకూ జరిగినవన్నీ బేరీజు వేస్తే – మొత్తం అంతా ఓ పథకం ప్రకారం జరిగిపోతోందనిపించింది.

శ్రీమతి ఏమనుమానిస్తోందో స్ఫురించింది.

అది గ్రహించినట్లుంది, "ఆ విషయం నన్నడగాలా? ఈ పాటికే మీకు స్ఫురించి ఉండాలి" అందామె.

ఇక సూటిగానే మాట్లాడొచ్చని, "అంటే వాళ్లు నన్ను మతం మార్చుకోమంటారనా నీ భయం. అంటే మారిపోతానా, నువ్వు మరీనూ. ఇన్నేళ్ల కాపురంలో నా గురించి నువ్వు తెలుసుకున్నదిదా?" అన్నాను.

"మీ గురించి తెలుసు కాబట్టే – నేను భయపడేది!" అంటూ ఆమె వివరించింది.

దేవుణ్ణి నిరసించనేమో కానీ నాకు మతం పట్టింపు లేదు. ఏ మతమైతే ఏంటి – అనుకుంటానుట.

రెండు – నాకెంత మొహమాటమంటే – 'మరో దేవుడు' గట్టిగా పిలిస్తే – మతం మార్చుకుందుకు కూడా వెనుకాడకపోవచ్చుట.

అలా అరటిపండొల్చినట్లు ఆమె నా గురించి విడమర్చి చెప్పేసరికి – నిజం చెప్పొద్దూ – అప్పుడు నా గురించి నాకే భయమేసింది.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments